కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను తరలిస్తామన్న హామీ ఏమైంది?

జీడిమెట్ల: జీడిమెట్లలో ప్రజలు కాలుష్యం వలన ఇబ్బందులు పడుతున్నా ఎమ్మెల్యే, కార్పొరేటర్ పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం సుభాష్‌నగర్ డివిజన్‌లోని ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో బీజేపీ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో బీజేపీ నాయకులు ముచ్చటించి వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. మల్లారెడ్డి మాట్లాడుతూ... సుభాష్‌నగర్ చుట్టు పక్కల ఉన్న పరిశ్రమల వలన కాలనీల్లోని ప్రజలు అవస్థలు పడుతున్న స్థానిక ఎమ్మెల్యే వివేకానంద పట్టించుకోవడం లేదని మల్లారెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన కొత్తలో కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను జీడిమెట్ల నుంచి తరలిస్తామని మాట ఇచ్చి తప్పించుకున్నారని అన్నారు.

◆ ప్రజలకు ఉత్త మాటలు చెప్పి మాటల గారడి చేయడంలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటి స్థానంలో ఉంటారని బీజేపీ నాయకులు ఎం.ఎస్ వాసు ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రజలకు చెప్పిన మాటలు నిలబెట్టుకోకుండా పైపెచ్చు ప్రశ్నించే వారిని శిక్షించడమే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఓటుతో కేసీఆర్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్ధగా ఉన్నారన్నారు.



ఇంటింటికీ కాంగ్రెస్ పాదయాత్ర

దుండిగల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రజా సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. ఇంటింటికీ కాంగ్రెస్ పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా జీడిమెట్లలో కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానిక ఎమ్మెల్యే సమస్యలను పట్టించుకోకుండా కుత్బుల్లాపూర్‌ను ప్రగతి పథంలో నడిపిస్తున్నామని చెప్పడం సిగ్గుచేటన్నారు. అధికారంలోకి రాగానే జీడిమెట్ల డివిజన్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ముందుంటా

దుండిగల్: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పొందుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. గాజులరామారం డివిజన్ చంద్రగిరినగర్‌కు చెందిన రాజు కుమార్తె శరణ్యకు మంజూరైన రూ.2.5 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. శంభీపూర్ రాజు మాట్లాడుతూ... ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ఎల్లప్పుడు ముందుంటానని పేర్కొన్నారు.

జీడిమెట్ల డివిజన్‌లో 'ప్రగతి యాత్ర'

రంగారెడ్డినగర్: జీడిమెట్ల డివిజన్‌లోని శివారెడ్డినగర్, వెంకన్నహిల్స్‌లలో శుక్రవారం ఎమ్మెల్యే వివేకానంద్ ప్రగతి యాత్ర చేపట్టారు. శివారెడ్డినగర్‌లో రూ. 97 లక్షలతో కల్వర్ట్, సీసీ రోడ్డు, డ్రైనేజీ లైన్, వెంకన్న హిల్స్ ఫేజ్-1లో రూ.1.80 కోట్ల నిధులతో మంజీర, డ్రైనేజీ లైన్‌లు, ఫేజ్-2లో రూ. కోటితో రోడ్లు ఇతర సదుపాయలను కల్పించిన ఎమ్మెల్యేకు స్థానికులు హారతులు పట్టారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు.

94మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

సుభాష్‌నగర్: గాజులరామారంలోని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం 94మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా చెక్కులను పంపిణీ చేశారు. ప్రస్తుతం ఆ పథకం సమయం అయిపోయినందున మిగిలిన కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. దీంతో కార్యాలయం లబ్ధిదారులతో రద్దీగా మారింది.

సాయిచంద్‌కు కొవ్వొత్తులతో నివాళి

నిజాంపేట్: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ మృతి తీరని లోటని వివిధ పార్టీల నాయకుల అన్నారు. శుక్రవారం రాత్రి నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లో రాజకీయ పక్షాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాలతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా ఈ ర్యాలీలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్, టీడీపీ, వామపక్షాలకు చెందిన నాయకులు పాల్గొని ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

సుభాష్‌నగర్: సిగ్మా ఆస్పత్రి (లైఫ్ స్పాన్) ఆధ్వర్యంలో గాజులరామారం డివిజన్ రావినారాయణరెడ్డినగర్ ఈస్ట్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. రావి నారాయణరెడ్డినగర్‌లోని వినాయక టెంపుల్ కమ్యూనిటీహాల్‌లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగే ఈ శిబిరంలో డయాబెటిక్, డెంటల్, ఆర్థో, స్త్రీ సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి యాజమాన్యం పేర్కొంది.













